# మొక్కజొన్న కొనుగోలుకు సిద్ధం చేయాలి

◆ అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు

గద్వాల అర్బన్ నవంబర్ 2 : రైతుల వద్ద నుంచి మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడానికి కావల్సిన కేంద్రాలు, గోడౌన్లు సిద్ధం చేయాలని జిల్లా కొనుగోలు కమిటీ (డీఎల్ పీసి)కి జిల్లా అదనపు కలెక్టర్ అదేశించారు.గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయంలో జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతుల సౌకర్యార్థం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎంపిక చేయాలని, గోడౌన్లను సిద్ధం చేయాలని మార్క్‌ఫెడ్ అధికారిని అదేశించారు. జిల్లాలోని మొక్కజొన్నను 4 జిల్లా సహకార పరపతి కేంద్రాల్లో కొనుగోలు చేస్తామని వారు తెలిపారు. జిల్లాలో అలంపూర్,క్యాతూరు,కలుగొట్ల మానవపాడు కేంద్రాలను ఎంపిక చేసినట్లు జిల్లా టీఎస్ మార్క్‌ఫెడ్ అధికారి అదనపు కలెక్టర్‌కు తెలియచేశారు.జిల్లాలో మొత్తం 13,400 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట పండిందని,రైతుల నుంచి ఎకరానికి గరిష్టంగా 18.44 క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.కనీస మద్దతు ధర 2,090 రూ.. నిర్ణయించడం జరిగిందని తెలిపారు.రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా,అన్ని వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు అదనపు కలెక్టర్ అదేశించారు.సమీక్షలో మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి భాస్కర్ రెడ్డి, మార్కెటింగ్ జిల్లా అధికారి పుష్ప, సివిల్ సప్లై అధికారి రేవతి, ఏడీఈ వెంకటలక్ష్మి,హౌసింగ్ అధికారులు, నాగ ఉపేందర్ ఉన్నారు.



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు

## జీవాలకు వ్యాక్సిన్ వేయించాలి



బైనపల్లిలో జీవాలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

అయిజ, నవంబర్ 2 : జీవాలకు పారుడు రోగ నివారణకు వ్యాధి నిరోధక వ్యాక్సిన్ వేయించాలని పశువైద్యాధికారి స్వరూపరాణి యజమానులకు సూచించారు. గురువారం మండలంలోని బైనపల్లి గ్రామంలో జీవాలకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. జీవాలకు రోగాలు రాకుండా ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్ అందజేస్తుందని ఆమె తెలిపారు. 19 మంది యజమానులకు చెందిన 1,883 గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేసినట్లు చెప్పారు. జీవాల యజమానులు టీకాలను మేకలు, గొర్రెలకు విధిగా వేయించాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఏస్ఈఏఎస్ సర్వేపరీక్ష..

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 2 : నేడు మండలంలోని 43 పాఠశాలల్లో ఏస్.ఈ.ఏ.ఎస్ (స్టేట్ ఎడ్యూకేషన్ ఆచీవ్‌మెంట్ సర్వేపరీక్ష) నిర్వహిస్తారని ఎంఈవో రాజు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని 43 పాఠశాలను ఎంపిక చేశారన్నారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని అధికారి తెలిపారు.

## నేడు విద్యుత్ అంతరాయం...

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 2 : మండలంలోని బీచుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తపవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా కొండపేట, ఎర్రవల్లి, యాక్తపూర్, కొండేరు, జింకలపల్లి గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

## పదిలో ఉత్తమ ఫలితాల కోసం కృషి



కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న వరలక్ష్మి

వడ్డేపల్లి, నవంబర్ 2 : కస్తూర్బా పాఠశాలలలోని విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు పొందడానికి ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని కస్తూర్బా ప్రత్యేకాధికారి పద్మ అన్నారు. లక్ష్య మాడ్యూల్లో తెలిపిన విధంగా ఉదయం, సాయంత్రం ఒక గంట అదనంగా తరగతులను నిర్వహిస్తున్నామని స్లిప్ టెస్ట్‌లు, ఎఫ్ఏత్రీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కస్తూర్బా విద్యాలయాల్లో విద్యార్థులు ఎల్లప్పుడూ అందుబాటులో వుండటం వల్ల లక్ష్య కార్యక్రమం విజయవంతమవుతుందని పద్మ అన్నారు. ఈ సంవత్సరం పదో తరగతిలో 50 మంది చదువుతున్నారని వారికి ప్రత్యేక తర్ఫీదు నిస్తున్నామని ఆమె అన్నారు. కార్యక్రమంలో వరలక్ష్మి, అంబిక, భాగ్యరేఖ, ప్రియంవద, చెన్నమ్మ, లక్ష్మిదేవి, మాలతి, సూర్యకిరణ్‌లు పాల్గొన్నారు.

## ఆర్డీఎస్ ఆనకట్టకు స్వల్ప ఇన్‌ఫ్లో

అయిజ, నవంబర్ 2 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో స్వల్పంగా చేరుతోంది. గురువారం ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 95 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 192 క్యూసెక్కులు నమోదైనట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 125 క్యూసెక్కులు చేరుతుండగా, ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 4.2 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

**టీబీ డ్యాంలో 31.352 టీఎంసీల నిల్వ ..**

కర్ణాటకలోని తుంగభద్రా డ్యాంలో ప్రస్తుతం 31.352 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో నిల్ నమోదు కాగా, అవుట్‌ఫ్లో 9,105 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 31.352 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల గరిష్ఠ నీటి మట్టానికి ప్రస్తుతం 1606.60 అడుగుల ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి రాఘువేంద్ర తెలిపారు.

# ఉపాధ్యాయుడు రావడం లేదని ఆందోళన



ఓబులోనిపల్లిలో పాఠశాలకు తాళం వేసి గేట్ బయట నిరసన తెలుపుతన్న గ్రామస్తులు, విద్యార్థులు

ధరూరు, నవంబర్ 2 : పాఠశాలకు ఉపాధ్యాయుడు రావడం లేధని గ్రామస్తులు పాఠశాలకు గేట్‌కు తాళం వేసిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. మండలంలోని ఓబులోనిపల్లి గ్రామంలో పాఠశాలకు ఉపాధ్యాయుడు రావడం లేదని విధ్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాలకు తాళం వేసి గేట్ బయట ఆందోళన చేపట్టారు. పాఠశాలలో పని చేస్తున్న హెచ్ఎం గత కొన్ని రోజుల నుంచి పాఠశాలకు హాజరు కావడం లేదని వున్న ఇద్దరు ఉపాధ్యాయులలో ఒక్కరే అన్ని క్లాసులను ఎలా చూసుకుంటారని అందోళన చేపట్టారు. అసలు ఉన్నతాధికారులు ఈ విషయంపై ఏమైన ఆలోచిస్తున్నార లేదా అని విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాల గేట్ బయట బైటాయించారు. మధ్యాహ్నం వరకు ధర్నా చేసి రేపటిలోగా సమస్యను పరిష్కరించకుంటే పూర్తిగా తాళం వేసి ఉన్నతాధికారుల కార్యాలయాల ఎదుటే ధర్నా చేపడతామని హెచ్చరించారు. దీనిపై ఎంఈవో సురేష్‌ను వివరణ కోరగా ప్రధానోపాధ్యాడు మెడికల్ లివ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడని తెలిపారు.

**ఎంఈవో సురేశ్ వివరణ..**

పాఠశాలలో పని చేసే ప్రధానోపాధ్యాయుడు గత కొన్ని రోజులుగా రావడం లేదని గ్రామస్థుల నుంచి నా ధృష్టికి సమాచారం వచ్చింది. దీనిపై హెచ్ఎం మెడికల్ లీవ్ అప్లికేషన్ పరిశీలనలో ఉంది. అయిన యాథావిధిగా రావడం లేదు. నా పరిధిలో షోకాజ్ నోటీస్ కూడా పంపాను. ప్రధానోపాధ్యాయుడి బాధ్యతలు కూడా మార్చి అసిస్టెంట్‌కు ఇచ్చాను. కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల హెచఎం పాఠశాలకు వెళ్ళడం లేదని తెలిసింది. దీనిపై జిల్లా విధ్యాధికారికి కూడా రిపోర్ట్ పంపాను. డీఈవో ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని, అంత వరకు డిప్యూటేషన్‌పై మరొక ఉపాధ్యాయుడిని పంపడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# రహదారి కష్టాలకుచెక్



మండలకేంద్రంలో నిర్మించిన సీసీరోడ్డు

మానవపాడు, నవంబర్ 2: నిత్యం రద్దీగా ఉండే రోడ్డు, ఇతర గ్రామాలతోపాటు వేరే మండలాలకు అనుసంధాన రోడ్డు గుంతలమయంగా ఉండేది. వర్షం వచ్చిందంటే కాలు కింద పెట్టడానికి వీలు పడేదికాదు. ఎంతోమంది వాహనదారులు కిందపడి గాయాలపాలయ్యారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు సైతం రోడ్డుపై వదిలేవారు. ప్రజలు రోడ్డుపై తిరగాలంటేనే భయపడేవారు. మండల కేంద్రం ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసిన ఎమ్మెల్యే అబ్రహం రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు చేయించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జాతీయ రహదారి నుంచి మండల కేంద్రాలకు డబుల్ రోడ్డు నిర్మించాలని నిధులు మంజూరు చేసి 3.5కిలో మీటర్లు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఎంపీడీవో కార్యాలయం వరకు నిర్మాణం పూర్తయింది, అక్కడి నుంచి బస్టాండు వరకు నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే ప్రభుత్వం నుంచి రోడ్డు నిర్మాణం కోసం రూ.90లక్షలు కేటాయించి ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. మట్టిరోడ్డు కాస్తా.. సీసీ రోడ్డుగా దర్శనమిస్తోంది. మండల కేంద్రం ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి.

## తాళం వేసిన ఇంట్లో చోరీ..

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 2 : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఇటిక్యాల మండలం కోదండాపూర్ పీయస్ పరిధిలోని పుటాన్‌దొడ్డి గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై కృష్ణదేవ కథనం మేరకు పుటాన్‌దొడ్డి గ్రామానికి చెందిన వెంకట్‌రమణరెడ్డి బుధవారం రోజు కుటుంబ సభ్యులతో వ్యవసాయ పని నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లారు. వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి సాయంత్రం వచ్చిచూడగా తాళం, గడీయా విరగ్గొట్టి ఉన్నది. అనుమానం వచ్చి లోనికి వెల్లి చూడగా బీరువాతెరిచే ఉంది. బీరువా లోని రూ.20వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం రోజు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## నేర్చుకోవాలన్న తపన ఉన్నప్పుడే రాణిస్తారు




సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కలందర్ బాషా

గద్వాలటౌన్, నవంబర్ 2 : ఏదైనా కొత్తవిషయాన్ని నేర్చుకోవాలన్న, సాధించాలన్న తపన ఉన్నప్పుడే రాణిస్తారని ఎంఏఎల్‌డీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్‌బాషా అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జిజ్ఞాస స్టడి ప్రాజెక్టుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు రిసోర్స్ పర్సన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శివప్రసాద్‌లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వినూత్న ఆలోచనలకు, పరిశోధనలకు జిజ్ఞాస ప్రాజెక్టు చక్కటి వేధికన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రాజెక్టులు ఎంతగానో దోహదపడతాయన్నారు. నూతన ప్రాజెక్టులను ఆవిష్కరించి విజేతగా నిలవాలని ఆకాక్షించారు. అనంతరం జజ్ఞాసపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ లవీనమంజులత, వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, అధ్యాపకులు మనోజ్‌కుమార్, హరినాగభూషణం, సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

## లక్ష నగదు పట్టివేత

మానవపాడు, నవంబర్ 2 : ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా నగదును తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ.లక్ష జప్తు చేసినట్టు ఎసై రాము తెలిపారు. తనిఖీల్లో భాగంగా గురువారం రాత్రి మండల పరిధిలోని శ్రీనగర్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో రామాపురం గ్రామానికి చెందినహరిజన ఆంజనేయులు బైక్‌పై కర్నూలు నుండి స్వంత గ్రామమైన రామాపురానికి వెళ్తుండగా మార్గమధ్యంలో శ్రీనగర్ వద్ద ఎన్నికల టీం బృందం నిర్వహించిన తనిఖీల్లో ఆంజనేయులు వద్ద రూ.లక్ష నగదును గుర్తించారు. తగిన ఆధారాలు చూపకపోవడంతో నగదును జప్తు చేసి ఉన్నతాధికారులకు అప్పగించినట్టు తెలిపారు.